క్లుప్తంగా

జిల్లా జడ్జిని మర్యాద పూర్వకంగా కలిసిన ఎస్పీ



జిల్లా ప్రధాన న్యాయమూర్తికి మొక్క అందజేస్తున్న ఎస్పీ నర్సింహ

చివ్వెంల(సూర్యాపేట) : సూర్యాపేట జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీ శారదను ఎస్పీ నర్సింహ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులు, దర్యాప్తు, కోర్టు క్యాలెండర్, ట్రయల్, లోక్ అదాలత్ నిర్వహణ, కేసుల్లో నేరస్తులకు శిక్ష అమలు వంటి అంశాలపై చర్చించారు. కోర్టు అధికారులు, పోలీసులు సమన్వయంతో పని చేసి త్వరితగతిన కేసుల పరిష్కారం చూపాలని న్యాయమూర్తి ఎస్పీకి సూచించారు.

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం



మాట్లాడుతున్న ఎంపీడీఓ గోపి

అర్వపల్లి : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపి, సీహెచ్ఓ బిచ్చునాయక్, కార్యదర్శులు నవీన్‌రెడ్డి, మహాలక్ష్మి, మాధవిక, నెహ్రూనాయక్, పర్వాన, నారాయణమూర్తి, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్, రమేష్, లింగయ్య, కృష్ణవేణి, శ్రవంతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అడ్వకేట్ అమైండ్‌మెంట్ బిల్లు రద్దు చేయాలి



పుస్తకం ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

చివ్వెంల : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అడ్వకేట్ అమైండ్‌మెంట్ యాక్ట్ బిల్లును వెంటనే రద్దు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో బిల్లుకు వ్యతిరేకంగా ముద్రించిన పుస్తకాలను గురువారం న్యాయవాదులు ఆవిష్కరించి మాట్లాడారు. న్యాయవాదులకు బిల్లు వ్యతిరేకంగా ఉందని, కేంద్ర ప్రభుత్వం న్యాయవాదుల అభిప్రాయాలను తీసుకుని వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు, ఐలు జిల్లా కార్యదర్శి మారపాక వెంకన్న, నల్లగుంట్ల అయోధ్య, మోదుగు వెంకట్‌రెడ్డి, గాదె వెంకట్‌రెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తుంగతుర్తి : మండలంలోని కొత్తగూడెం గ్రామంలో నిర్మిస్తున్న కంఠమహేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ పంపిన రూ.25వేలను మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పులుసు యాదగిరి, బీఆర్ఎస్ నాయకులు తాటికొండ సీతయ్య, గుండగాని రాములు, మట్టపల్లి శ్రీశైలంగౌడ్ సంఘం నాయకులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు వర్దెల్లి లింగయ్య, వర్దెల్లి సత్యనారాయణ, వర్దెల్లి మహేష్, వర్దెల్లి శ్రీకాంత్, వర్దెల్లి వీరభద్రం, గుండగాని సందీప్, గుండగాని నారాయణ, సైదులు, భిక్షం, మల్లయ్య, వీరయ్య, వెంకన్న, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

మద్దిరాల : ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గడ్డివాము దగ్ధమైంది. ఈ సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జక్కుల అవిలయ్య తన వ్యవసాయ భూమి వద్ద 5ఎకరాల గడ్డివామును ఏర్పాటు చేశాడు. బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో గడ్డివాము పూర్తిగా దగ్ధమైందని, దీంతో పాటు గడ్డివాము సమీపంలో ఉన్న షెడ్‌లోని పైపులు, ఇతర వ్యవసాయ సామగ్రి కాలి బూడిదైనట్లు బాధిత రైతు తెలిపారు. దీంతో సుమారు రూ.30వేల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం బాధితుడికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని స్థానికులు కోరారు.

హోటల్‌కు వెళ్తున్నారా.. జర జాగ్రత్త!

- నాణ్యతా ప్రమాణాలు పాటించని నిర్వాహకులు
- ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం

సూర్యాపేట అర్బన్ : భోజనం చేద్దామని ఏ రెస్టారెంటో, హోటల్‌కో వెళుతున్నారా.. అయితే చికెన్, ఇతర ఆహార పదార్థాలను ఆర్డర్ ఇచ్చే ముందు జర జాగ్రత్త. అక్కడ ఎలాంటి చికెన్ సర్వ్ చేస్తున్నారో ఓ కన్నేయండి. ఎందుకంటారా.. ఈ మధ్యకాలంలో హోటల్స్, రెస్టారెంట్లలో కుళ్లిన చికెన్ దందా జోరుగా సాగుతోంది. వెళ్లిన వారికి కుళ్లిన చికెన్‌తో మంచి విందు భోజనం వడ్డించేస్తున్నారు హోటల్స్, రెస్టారెంట్ల నిర్వాహకులు. దీంతో ఆలోచించకుండా ఒక్కసారి లాగించేయకుండా నాణ్యతా పరిశీలించి తినాలి. ఈ కుళ్లిన చికెన్ దందా దెబ్బకు అధికారులు, పోలీసులే షాకయ్యారు మరి.

సూర్యాపేటలోని పలు హోటల్‌లు, రెస్టారెంట్లు సరైన నిర్వహణ చేపట్టకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచకుండా రెండు మూడు రోజుల ఆహార పదార్థాలను, చికెన్ ఫ్రిజ్లో పెట్టి రోజులకొద్దీ నిల్వ ఉంచి వాటిని మళ్లీ వినియోగదారులకు వడ్డిస్తున్నారు. దీంతో నిబంధనలకు తిలోదకాలు వదిలేస్తున్న హోటల్స్, రెస్టారెంట్, రోడ్ సైడ్ బిర్యానీ సెంటర్ నిర్వాహకులకు మున్సిపల్ అధికారులు జరిమానాలు విధిస్తున్నారు.

ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోని నిర్వాహకులు..

సూర్యాపేటకు చుట్టుపక్కల 30కిలోమీటర్ల దూరంలో ఏ ప్రధాన పట్టణం లేకపోవడంతో వివిధ రకాల పనుల నిమిత్తం ప్రతిరోజు కొన్ని వేలమంది సూర్యాపేట పట్టణానికి వస్తుంటారు. మధ్యాహ్నం అయ్యిందంటే ఏదో ఒక హోటల్‌కి వెళ్లి భోజనం చేయాల్సిందే. కానీ కొంతమంది హోటల్ యజమానులు తినే ఆహారాన్ని సైతం కల్తీ చేస్తున్నారు. పెద్ద పేరున్న హోటల్స్‌లోనే బిర్యానికి రెండు మూడు రోజుల నుంచి నిల్వ ఉంచిన చికెన్ వినియోగించడం, నాసిరకం నూనెలను, సరుకులను వాడి ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు.

బిర్యానీలో ఈగ..

ఇటీవల హంగ్రీ బర్డ్స్‌లో ఓ వినియోగదారుడు బిర్యానీ ఆర్డర్ చేయగా బిర్యానీలో ఈగ రావడంతో ఫిర్యాదు మేరకు మున్సిపల్ అధికారులకు జరిమానా విధించారు. హోటల్ బిర్యానీలో ఈగ వచ్చిన సంఘటన మరవక ముందే మరో రెస్టారెంట్‌లో తనిఖీ చేసిన అధికారులకు ఫ్రిజ్లో నిల్వ ఉంచిన చికెన్ లభించడంతో జరిమానా విధించిన విషయం విధితమే. ఇలా ప్రతిరోజు ఏదోఒక హోటల్‌లో తనిఖీలు చేసి జరిమానాలు విధిస్తున్నా హోటల్ యజమానులు తీరు మారకుండా తమ కల్తీ దందాను జోరుగా కొనసాగిస్తున్నారు. బేకరీల్లో బ్రెడ్ నిల్వ సమయం పూరైనా అలాగే విక్రయాలు జరుపుతున్నారు.



ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

అధికారుల నిర్లక్ష్య ధోరణి..

ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారులు హోటల్స్, రెస్టారెంట్లలో ఇతర హోటల్లలో నిత్యం తనిఖీలు చేయకుండా నిర్లక్ష్యం వహించడంతో అదే అదునుగా భావించి హోటల్ యజమానులు రెచ్చిపోతున్నారు. రోడ్ సైడ్ బిర్యానీ సెంటర్లలో, చిన్నచిన్న హోటల్స్‌లో వాడిన నూనెను మళ్లీమళ్లీ వాడి ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుతున్నారు. ఇకనైనా ఫుడ్ సేఫ్టీ అధికారులు, మున్సిపల్ అధికారులు స్పందించి తనిఖీల విషయంలో కఠినంగా వ్యవహరించి కల్తీకి పాల్పడితే సీజ్ చేయాలని పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయంపై వివరణ కోరకు ప్రయత్నించగా మున్సిపల్ అధికారులు స్పందించలేదు.



కొద్దిగా ఉడికించి నిల్వ ఉంచిన చికెన్



నాణ్యతలేని ఆహారపదార్థాలు

నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ చేయాలి



సూర్యాపేట పట్టణంలోని హోటల్స్‌లో కల్తీలు ఎక్కువయ్యాయి. రోడ్డు వెంబడి బిర్యానీ సెంటర్లు విచ్చలవిడిగా వెలిశాయి. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో, టిఫిన్ సెంటర్ల దగ్గర ప్రతిరోజు వాడిన నూనె వాడుతున్నారు. పాడైన కూరగాయలతో, నూనెలతో ఉడికించిన చికెన్‌ను తినడంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. పెద్దపెద్ద హోటల్‌లోనే నిబంధనలు పాటించడం లేదు. అధికారులు స్పందించి నిబంధనలు అతిక్రమించే వాటిని గుర్తించి జరిమానాలతో పాటు సీజ్ చేయాలి.

- భూపతి శ్రీనివాస్, సూర్యాపేట

'భూ భారతి'తో భూ సమస్యలు పరిష్కారం

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

తుంగతుర్తి : భూ భారతి చట్టంతో రైతుల భూ సమస్యలు పరిష్కారం కానున్నట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే మందుల సామేల్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. భూ భారతి చట్టాన్ని అధికార వికేంద్రీకరణ చేయడం జరిగిందన్నారు. భూ భారతి చట్టంలో తహసీల్దార్ నుంచి సీసీఎల్ఏ స్థాయి వరకు సమస్యలు పరిష్కరించేందుకు వెసులుబాటు కల్పించారని అన్నారు. భూ భారతి పోర్టల్‌ను అన్ని సమస్యలకు స్వయంగా దరఖాస్తు చేసుకునేలా రూపొందించినట్లు తెలిపారు. భూ సమస్యల పరిష్కరానికి అప్పీల్ వ్యవస్థను ఏర్పాటు చేశారని జూన్ 02 నుంచి చట్టం పూర్తిస్థాయిలో అమలోకి వస్తుందన్నారు.

భూ భారతితో ధరణి దరిద్రం పోయింది : ఎమ్మెల్యే సామేల్

కాంగ్రెస్ తెచ్చిన భూ భారతితో ధరణి దరిద్రం పోయిందని, భూ భారతి చట్టంతో పేదల భూములకు భద్రత ఏర్పడిందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి రోజున భూ భారతి చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవరావు, తహసీల్దార్లు దయానందం, హరిప్రసాద్, ఎంపీడీఓ శేషుకుమార్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పక్కన ఎమ్మెల్యే సామేల్

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం



మే డే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సూర్యాపేట అర్బన్ : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తుందని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామళ్ల నవీన్, ఘంట నాగయ్య అన్నారు. గురువారం పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. దేశంలో కార్మిక వర్గం మెరుగైన సౌకర్యాల కోసం పనిదినాల, గంటల తగ్గింపు కోసం కార్మిక వర్గం పోరాటాలు చేస్తుంటే మరో పక్క మోదీ ప్రభుత్వం కార్పొరేట్, పెట్టుబడుదారులకు ఊడిగం చేస్తూ కార్మిక హక్కులను హరించి వేస్తున్నారని అన్నారు. కార్పొరేట్ సంస్థలైన ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టి, జిందాల్, ఆదానీ, అంబానీ సంస్థలు లాంటి వారు కార్మికుల శ్రమను దోచుకోవడానికి రోజుకు 12లేదా 13గంటలు పనిచేయాలని, చేయించాలని ప్రభుత్వాలపై ఒత్తిడి చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. 29కార్మిక చట్టాలను నాలుగు లేబర్ లేబర్ కోడ్ లాగా చేసి, ఆధునిక టెక్నాలజీ ఏఐతో కార్మిక వర్గానికి ఉరితాళ్లుగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మే డే పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, జిల్లా కమిటీ సభ్యులు సామ నర్సిరెడ్డి, నాగేల్లి రామనరసయ్య, మూరగుండ్ల మధు, హమాలీ యూనియన్ నాయకులు పురుషోత్తం, చంద్రశేఖర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుపదార్థాల బారిన పడొద్దు

తుంగతుర్తి : యువత మత్తుపదార్థాల బారిన పడొద్దని ఏఎస్పీ నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని కొత్తగూడెంలో నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సన్మార్గంలో నడిచేలా చూడాలని, యువత మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదకద్రవ్యాలు వాడడంతో ప్రాణాంతకమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని, దీంతో ఆర్థికంగా నష్టపోయి అవకాశం ఉంటుందన్నారు. ప్రజలందరూ ఐక్యమత్యంతో ఉండాలని కోరారు. వివిధ చట్టాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం కళాబృందం ఆటపాటలతో మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ నరసింహారావు, ఎస్ఐ క్రాంతికుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగం ప్రాణాంతకం

తాళ్లగడ్డ (సూర్యాపేట) : డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం ప్రాణాంతకమని ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని వాణిజ్య భవన్ వద్ద గురువారం దినసరి కూలీలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ «నో డ్రగ్స్ సేవ్ లైఫ్»అనే నినాదంతో అవగాహన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడారు. డ్రగ్స్ వాడకం వలన ఇటీవలి కాలంలో ఎంతో మంది అనారోగ్యానికి గురై చనిపోతున్నారని, యువత పెడదారిన పడకుండా వారిలో మార్పు రావడానికి తనవంతుగా కృషి చేస్తున్నానని తెలిపారు.



తుంగతుర్తి : ప్రజా భరోసా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలి



తిరుమలగిరి : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

అర్వపల్లి : వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్ కోరారు. గురువారం మండల పరిధిలోని కొమ్మాల, నాణ్యతండా, అడివెంల గ్రామాల్లో రజతోత్సవ సభ విజయవంతానికై సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు డాక్టర్ తాడూరి రామకోటి, చిర్రబోయిన వెంకన్న, సుందర్‌నాయక్, గడ్డం వెంకన్న, నాగు, మల్లేష్, తిరుమల్, ప్రవీణ్, మల్సూరు, బయ్య కృష్ణ, భూపతి ఉపేందర్, సాయిబాబు, సైదులు, మల్లయ్య, ఉప్పలయ్య, దాసరి భిక్షం, దూదిగామ వెంకటయ్య, నాయకులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లో సభకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో దయాయాదవ్, మలకయ్య, హరీష్, పురుషోత్తం, ఉదయ్, మోహన్, నాగన్న, ప్రవీణ్, అశోక్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

నూతనకల్ : వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్యయాదవ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సభకు ప్రతి కుటుంబం నుంచి ఇద్దరు చొప్పున తరలిరావాలని కోరారు. అన్ని గ్రామశాఖల అధ్యక్షులు ఆయా గ్రామాల్లో బహిరంగ సభకు కార్యకర్తలను తరలివెళ్లే విధంగా చూడాలని అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు బత్తుల సాయిలుగౌడ్, చూడి లింగారెడ్డి, గాజుల లింగరాజు, బత్తుల విద్యాసాగర్, మందడి సోమిరెడ్డి, రేసు వెంకటేశ్వర్లు, మొగుళ్ల వెంకన్న, మహేశ్వరం మల్లికార్జున్, బత్తుల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

తిరుమలగిరి : కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పార్టీ ఆధ్వర్యంలో మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి నెల రోజులు కావొస్తున్నా కాంటాలు కాక పోవడం, కాంటాలు అయిన ధాన్యం దిగుమతి కాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కడెం లింగయ్య, కదారి లింగయ్య, మిట్టపల్లి లక్ష్మి, చిత్తలూరి సోమయ్య, దూపటి రాములు, శ్రీను, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పురుషోత్తం సేవలు మరువలేనివి

తాళ్లగడ్డ (సూర్యాపేట) : పట్టణంలోని శ్రీసంతోషిమాత దేవాలయం నిర్మాణం, అభివృద్ధిలో యమా పురుషోత్తం సేవలు మరువలేనివని ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశం గుప్తా, బ్రాహ్మండ్లపల్లి మురళీధర్ అన్నారు. గురువారం పట్టణంలో శ్రీసంతోషిమాత ఆలయం గౌరవ సలహాదారుడు యమా పురుషోత్తం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం కుటుంబ సభ్యులకు జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ ఉపాధ్యక్షుడు నరేంద్రుని విద్యాసాగర్‌రావు, బెలిదే అశోక్, ఉపకోశాధికారి కొత్త మల్లికార్జున్, అన్నదాన నిర్వాహకులు దేవరశెట్టి సోమయ్య, కమిటీ సభ్యులు బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, గోపారపు రాజు, మహంకాళి ఉపేందర్, ముదిరెడ్డి లింగారెడ్డి, బొల్లం సురేష్, కర్నాటి రామమూర్తి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పురుషోత్తం కుటుంబ సభ్యులకు జ్ఞాపికను అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పహల్గాం ఉగ్రదాడులను నిరసిస్తూ ఆందోళన

చివ్వెంల : పహల్గాంలో భారతీయులపై ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ గురువారం సూర్యాపేట బార్ అసోషియేషన్ అధ్వర్యంలో విధులు బహిష్కరించారు. అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి కోర్టు ఎదుట ఉన్న కల్నల్ సంతోష్‌బాబు విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడారు. సామాన్యులను చంపి పైశాచిక అనందం పొందుతున్న ఉగ్రమూకపై వెంటనే చర్యలు తీసుకుని, మృతుల ఆత్మకు శాంతి చేకూర్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గుంటూరు మధు, ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు, నల్లకుంట్ల అయోధ్య, నాయిని రామ్మోహన్‌రావు, వై.బుచ్చేశ్వర్‌రావు, మారపాక వెంకన్న, రాచకొండ యాదగిరి, కోక రంజిత్ కుమార్, చంద్రకాంత్, అల్లంనేని వెంకటేశ్వర్‌రావు, గాదె వెంకట్‌రెడ్డి, డి.కిశోర్, పి.నర్సింగరావు, పత్తిపాక శ్రీనివాస్‌రావు, రాజు, నారాయణ, కుమారస్వామి, వీరప్రసాద్, సందీప్‌కుమార్, సరిత, సతీష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

సూర్యాపేట అర్బన్ : కశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై దాడి చేసి 27మందిని చంపిన ఉగ్రవాదుల చర్యలను సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉగ్రవాదుల చర్యలను దేశ ప్రజానీకం ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. దేశంలో ఆర్మీలో రెండు లక్షల పైగా ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి దేశ భద్రతకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

అర్వపల్లి : కశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ అర్వపల్లిలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో పాకిస్తాన్ ఉగ్రమూకల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రదాడి క్షమించరాని చర్య అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కూర శంకర్, మారపాక రాములు, జిన్నె అశ్విన్, గణేష్, బొడ్డు వీరేందర్, నాగరాజు, అక్షయ్ రవి, నాగరాజు, బద్రి, శ్రీకాంత్ ఉన్నారు.

కశ్మీర్‌లో ఉగ్రదాడి హేయమైన చర్య

మద్దిరాల : కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు దుశ్చర్యలకు పాల్పడడం హేయమైన చర్య అని బీజేపీ మండల అధ్యక్షుడు వడ్డాణం కిరణ్‌కుమార్ అన్నారు. పహల్గాంలోని పర్యాటక ప్రాంతంలో 28మంది భారతీయ పౌరులను కాల్చి చంపడాన్ని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. శాంతియుతంగా ఉన్న కశ్మీర్‌లో ఉగ్రవాదులు దాడులకు పాల్పడడాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. ఉగ్రవాదులను తుదముట్టించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఉగ్రవాదాన్ని పెంచిపోస్తున్న పాకిస్తాన్ దేశాన్ని ప్రపంచ దేశాలు ఖండించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొంపెల్లి గంగాధర్, చందసాని శ్రీహరి, వాసుదేవ్, నితిన్‌రెడ్డి, విక్రమచారి, ముతినేని రమేష్, వెలుగు రమేష్, పొన్నం శేఖర్, వెలిమినేటి రాము, వల్లపు అశోక్, శంభయ్యనాయుడు, తులసిదాసు, యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.



మద్దిరాలలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు



అర్వపల్లిలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ హయాంలోనే అంబేద్కర్‌కు సముచిత గౌరవం

తాళ్లగడ్డ (సూర్యాపేట) : బీజేపీ హయాంలోనే బీఆర్ అంబేద్కర్‌కు సముచిత గౌరవం కల్పించారని మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం అంబేద్కర్ జయంతి ఉత్సవాల జిల్లా కన్వీనర్, బీజేపీ జిల్లా కార్యదర్శి కొండా హరీష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను కాంగ్రెస్ అనేక సార్లు అవమానించిందన్నారు. కనీసం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో అంబేద్కర్ చిత్రపటాన్ని ఉంచేందుకు కూడా కాంగ్రెస్ ఇష్టపడలేదన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి గజ్జెల వెంకట్‌రెడ్డి, రుక్మారావు, కడియం రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న తాడూరి శ్రీనివాస్

అర్వపల్లిలో వైద్యశిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్ నగేష్, సిబ్బంది

అర్వపల్లి : అర్వపల్లిలో మండల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ భుక్య నగేష్‌నాయక్ మాట్లాడుతూ.. ఎండలు తీవ్రమైనందున ప్రజలు అవసరముంటేనే బయటకు రావాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఎం.బిచ్చునాయక్, ఎంఎల్‌హెచ్‌పీలు గౌతమి, వశిత, వాణి, సైదమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు మే నెల సెలవులు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

సూర్యాపేట అర్బన్ : వేసవి ప్రారంభమైనందున అంగన్‌వాడీలకు మే నెలలో సెలవులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టరేట్ పరిపాలనా అధికారికి గురువారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వెల్ఫేర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బొలిశెట్టి భాస్కరమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు మామిడి వసంత, మంజుల దేవి, ఆయా మామిడి దుర్గమ్మ పాల్గొన్నారు.

అర్హులకు జాబ్‌కార్డులు జారీచేయాలి

అర్వపల్లి : అర్హులైన వారందరికీ ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డులు జారీ చేయాలని ఉపాధిహామీ పథకం మేట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ నర్సయ్య అధికారులను కోరారు. గురువారం అర్వపల్లిలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కుటుంబ కార్డులలో పిల్లలు, కోడళ్ల పేర్లను చేర్చాలని విజ్ఞప్తి చేశారు. 18ఏళ్లు నిండిన వారికి కొత్తగా జాబ్‌కార్డులు ఇవ్వాలని సూచించారు. కొత్త జాబ్‌కార్డుల కోసం అర్హులైన వారు ఉపాధిహామీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. సమావేశంలో సంఘం నాయకులు విజయ, లింగయ్య, మధుకర్ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

సూర్యాపేట అర్బన్ : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరి యాదగిరి అన్నారు. గురువారం పట్టణంలో ధర్మపీఠం ఆధ్యాత్మిక ప్రచార వేదిక వ్యవస్థాపకుడు వంశీకృష్ణ, టెంట్‌హౌస్ రాములు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు తాగునీరు అందించాలనే ఆలోచన రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధూపాటి శ్యాంబాబు, అసోసియేషన్ సభ్యులు తిరుపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న యాదగిరి

ఆర్థికసాయం అందజేత



పెన్‌పహాడ్ : ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

పెన్‌పహాడ్ : మండలంలోని లింగాల గ్రామానికి చెందిన దాచేపల్లి అజయ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. 2001-2002సంవత్సరంలో పదోతరగతి విద్యనభ్యసించిన తోటి స్నేహితులు గురువారం మృతుడి దశదిన కర్మకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం స్నేహితులు సేకరించిన రూ.75,500లు కుటుంబానికి ఆర్థికసాయంగా అందించారు. కార్యక్రమంలో స్నేహితులు సలిగంటి మధు, దాచేపల్లి శ్రీనివాస్, షేక్ జాన్‌షరీఫ్, రామినేని సైదులు, వంగాల అరవిందు, ఎరకల విష్ణు, హస్సేన్, బచ్చు సైదులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మండల పరిధిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన నిరుపేద మాతంగి వెంకటనర్సు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి కుటుంబానికి గ్రామానికి చెందిన ఓర్సు అనిల్ తిరుమలగిరి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బందెల అర్వపల్లి ద్వారా రూ.10వేల ఆర్థికసాయం గురువారం అందించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, శ్రీకాంత్, ఉమేష్, ప్రవీణ్, రాంబాబు పాల్గొన్నారు.